క్లుప్తంగా

నడిపల్లి తైబజార్ వేలం



డిచ్‌పల్లి: నడిపల్లి గ్రామ పంచాయతీలో బుధవారం తైబజార్ వేలంపాట నిర్వహించారు. మండల పంచాయతీ అధికారి (ఎంపీవో), గ్రామ ప్రత్యేకాధికారి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాటలో ఐదుగురు వ్యాపారులు పాల్గొనగా వీరిలో జావీద్ అనే వ్యాపారి రూ.13లక్షల 11వేలకు వేలంపాట పాడి తైబజార్ వసూలు దక్కించుకున్నారు. అనంతరం ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్ ఉత్తర్వులను జావీద్‌కు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి నిట్టు కిషన్‌రావు, జూనియర్ అసిస్టెంట్ రజత్, సిబ్బంది రాము, సంతోష్, శ్యాంసన్, బాబా తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం పరిశీలన



సిరికొండ: మండలంలోని చిన్నవాల్గోట్ గ్రామంలో పంట కోత ప్రయోగాన్ని జిల్లా ప్రణాళిక ముఖ్య అధికారి బాబురావు బుధవారం పరిశీలించారు. పంటదిగుబడిని అంచనా వేయడానికి, ధాన్యం ఎగుమతి దిగుమతుల విధానాలను రూపొందించడానికి ఈ ప్రయోగం ప్రభుత్వం చేపడుతుందని సీపీవో తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయ ఆవరణలో వర్షపాతం కొలిచే యంత్రాన్ని బాబురావు పరిశీలించారు. యంత్రం పనితీరు గురించి తెలుసుకున్నారు. తహసీల్దార్ రవీందర్‌రావు, డివిజనల్ గణాంక అధికారి గంగాధర్, ఏఎస్‌వో రాజీవ్ పాల్గొన్నారు.

నియామకం



సిరికొండ: కేంద్ర పర్యావరణ అటవీ, వాతావరణ మంత్రిత్వ శాఖ నిపుణుల అంచనా కమిటీ సభ్యులుగా దుప్యతండాకు చెందిన ప్రొ. బుక్య రాజం ఎంపికయ్యారు. రాజం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ,ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్నారు. రాజం ఎంపికపై తండావాసులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



ధర్పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను డీఎంహెచ్‌వో సుదర్శనం, డీసీహెచ్‌ఎస్ శివశంకర్ పంపిణీ చేశారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలకు పోషకాహార లోపం, రక్తహీనత లేకుండా ఆరోగ్య పరిరక్షణకు న్యూట్రిషన్ కిట్స్‌తో ప్రయోజనం కలుగుతుందని అన్నారు. మెడికల్ ఆఫీసర్ సుశాంత్ రెడ్డి, సిబ్బంది పద్మావతి, రమేష్, సృజన, కృష్ణ, వాజిద్, సంతోష్ ఉన్నారు.

విషయ పరిజ్ఞానం పెంచుకోవాలి



నిజామాబాద్‌అర్బన్: విద్యార్థులు తరగతి గదిలోనే ఎక్కువగా గడిపి విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని ఏబీవీపీ నగర అధ్యక్షుడు వెంకటకృష్ణ అన్నారు. ఎస్‌ఎస్‌ఆర్ డిగ్రీకళాశాలలో బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ' పరిసర్ చలో అభియాన్ 'కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతిరోజు కళాశాలకు హాజరుకావాలన్నారు. నాయకులు మనోజ్ కుమార్, దామా సునీల్, దుర్గ దాస్ ఉన్నారు.

లెప్రసీ సర్వే డబ్బులు చెల్లించాలి



సుభాష్‌నగర్: జిల్లాలో ఆశా సిబ్బంది 2021 నుంచి 2023 వరకు చేపట్టిన లెప్రసీ సర్వే పెండింగ్ డబ్బులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. బిల్లులు చెల్లించిన తర్వాతే ఈయేడాది లెప్రసీ సర్వే చేపడుతామని స్పష్టంచేశారు. ఈమేరకు నగరంలోని కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం వారు ధర్నా నిర్వహించి నిరసన తెలియజేశారు. అనంతరం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ ప్రతినిధులు విజయ, రేణుక, సుకన్య, బాలమణి, రమా, సునీత, లలిత, ఆసియా, పద్మ, రేణుక, సరోజ, వసంత, సుజాత పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డులో 'చిల్లర' పనులు

పొట్టకూటి కోసం కొంతమంది డంపింగ్ యార్డులో ప్లాస్టిక్‌బాటిల్స్, డబ్బాలు, విరిగిన ఇనుప ముక్కలు తదితర వాటిని ఏరుకొంటున్నారు. వాటిని అమ్మగా వచ్చిన డబ్బులతోనే జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి వారి వద్ద డంపింగ్‌యార్డు సిబ్బంది డబ్బులు తీసుకొని చెత్తను ఏరుకోవడానికి అనుమతి ఇస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.



డంపింగ్‌యార్డులోని చెత్తలో సామగ్రిని ఏరుకుంటున్న పేదలు

- చెత్త ఏరుకునే వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్న సిబ్బంది
- పట్టించుకోని అధికారులు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని డంపింగ్‌యార్డుకు ప్రతినిత్యం సుమారుగా 180 మెట్రిక్ టన్నుల నుంచి 200 మెట్రిక్ టన్నుల చెత్త వస్తుంది. మున్సిపల్ సిబ్బంది చెత్త వాహనాల్లో చెత్తను డంపింగ్‌యార్డుకు తీసుకువస్తారు. చెత్తలో ప్లాస్టిక్, ఇనుము తదితర వస్తువులు ఉండటంతో చెత్త ఏరుకొని జీవనం సాగించే వారు డంపింగ్‌యార్డుకు వచ్చి, వాటిని ఏరుకుంటున్నారు. కానీ డంపింగ్‌యార్డు సిబ్బంది అలాంటి వారి వద్ద డబ్బులు తీసుకొని లోనికి పంపిస్తున్నారు. దీంతో ఇవేం చిల్లర పనులు అంటూ పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ తతంగం అధికారులకు తెలిసిన మౌనం వహించడంపై అనుమానాలకు తావిస్తుంది.

చెత్త ఏరితే కమీషన్..


పేదరికంతో జీవనం సాగిస్తున్న కొంతమంది డంపింగ్‌యార్డులో ఉన్న చెత్తలో ప్రతినిత్యం ప్లాస్టిక్ బాటిల్స్, డబ్బాలు, విరిగిపోయిన ఇనుపముక్కలు, తదితర సామగ్రిని ఎరుకుంటున్నారు. వీరు ఎరుకున్న పనికిరాని చెత్తను అమ్ముకుంటే రోజుకు రూ.100 నుంచి రూ. 150వరకు వస్తుంది. ఈ డబ్బులతోనే వారు జీవనం సాగిస్తున్నారు. అయితే డంపింగ్‌యార్డులో పని చేసే కొంతమంది సిబ్బంది చెత్త ఏరుకునే వారి వద్ద కమీషన్‌లకు కక్కుర్తి పడడం చర్చనీయంశంగా మారింది. పొట్టకూటి కోసం చెత్తలో చెత్త ఏరుకుంటే వారి వద్ద కమిషన్‌లు తీసుకోవడం ఏంటనీ పలువురు మండిపడుతున్నారు. సిబ్బంది ఇంత చీపుగా వ్యవహరించడం సరికాదంటున్నారు. డంపింగ్‌యార్డులో కమీషన్ దందా గత కొన్ని సంవత్సరాలు జరుగుతుంది. అయినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. డంపింగ్‌యార్డులో పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో డంపింగ్‌యార్డు సిబ్బంది అమాయకుల వద్ద చిల్లర దోపిడీకి పాల్పడుతున్నారు. పైగా ఈ వ్యవహారం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. ఈ విషయంపై అధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాలి మరీ.

గతంలో హెచ్చరించా..

డంపింగ్‌యార్డులో గతంలో చెత్త ఏరుకునే వారి వద్ద మా సిబ్బంది డబ్బులు తీసుకుంటున్న విషయం నా దృష్టికి వస్తే హెచ్చరించాను. మళ్లీ ఇలాంటివి జరుగుతున్న విషయం తెలియదు. తగిన చర్యలు తీసుకుంటాను.

– సాల్మన్‌రాజ్, డంపింగ్‌యార్డు ఇన్‌చార్జి

నేటి చిత్రం..



శిథిలావస్థకు చేరిన ఖిల్లా ముఖద్వారం

చారిత్రక కట్టడంపై నిర్లక్ష్యమేల?

నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని చారిత్రక కట్టడమైన ఖిల్లా ముఖద్వారం శిథిలావస్థకు చేరుకుంటోంది. నిర్వహణ సరిగా లేక ముఖద్వారంపై పిచ్చిమొక్కలు పెరిగి ప్రమాదకరంగా మారాయి. జిల్లాకే తలమానికమైన చారిత్రక సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఖిల్లా ముఖద్వారంను ఆధునీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

వైద్య వ్యవస్థను బలోపేతం చేస్తాం



ధర్పల్లిలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ధర్పల్లి: రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పాత ఆస్పత్రి వద్ద రూ. 33.15 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పదేళ్లలో వైద్య వ్యవస్థను నాశనం చేసి, కార్పొరేట్ ఆస్పత్రులకు కొమ్ముకాశారని ఆరోపించారు. ఏడాదిలోగా పనులు పూర్తిచేసి, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరగాలని కొత్తగా 16 కార్పొరేషన్లను ఏర్పాటు చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. ఎంపీ అరవింద్ జిల్లాలో ఒక్క గ్రామానికైనా నిధులు కేటాయించి అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. డీఎంహెచ్‌వో సుదర్శన్, తహసీల్దార్ మాలతి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, నాయకులు ముప్ప గంగారెడ్డి, ఆర్మూర్ బాలరాజ్, భాస్కర్‌రెడ్డి, బద్దం రాంచందర్, మనోహర్ రెడ్డి, మిట్టపల్లి గంగారెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ల ఏర్పాటుపై హర్షం







నగరంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు.. ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మున్నూరుకాపు సంఘ నేతలు.. పద్మశాలీ సంఘ నేతలు

నిజామాబాద్‌నాగారం: తెలంగాణలోని బీసీ కులాలైన ముదిరాజ్, యాదవ, మున్నూరుకాపు, పద్మశాలి, పెరక, లింగయాత్ గంగాపుత్ర, మేరకులస్తులకు కార్పొరేషన్‌లు ఏర్పాటుచేయడం హర్షణీయమని తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి జిల్లా అధ్యక్షులు కొట్టూరు చంద్రకాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో..

మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రకటించడం హర్షణీయం అని మాజీ మేయర్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు ఆకుల సుజాత, రాష్ట్ర కార్యదర్శి లింగం పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఆకుల శ్రీశైలం, ఎండల ప్రసాద్, రాజు, కిషన్ రెడ్డి, భూపతి, నరేష్, ప్రవీణ్, మహేష్, భోజరాజు, కర్క రమేష్, జెట్టి గోవిందరాజ్, శ్రీకాంత్, భూమేష్ పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..

పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు దీకొండ యాదగిరి పేర్కొన్నారు. నగరంలోని కోటగల్లి పద్మశాలి సంఘ భవనంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్,ప్రభుత్వ మాజీ విప్ ఈరవత్రి అనిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ ప్రతినిధులు బిజ్జు దత్త్రాద్రి, పుల్గం హన్మాండ్లు, దశరథం, రాపెల్లి గురుచరణ్, మెరుగు లక్ష్మినారాయణ, చింతల గంగాదాస్, విఠల్, లక్కవ త్రి దాస్, నారాయణ, సత్యపాల్, గంగాచరణ్ పాల్గొన్నారు.



రెడ్డి సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు

ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో..

రాష్ట్రంలో ముదిరాజ్ కార్పొరేషన్ ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు మెతుకు శివకుమార్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దీని వల్ల తెలంగాణలో ఉన్న నిరుపేద ముదిరాజ్‌లందరికి న్యాయం జరుగుతుందన్నారు.

రెడ్డి సంఘాల ఆధ్వర్యంలో..

సుభాష్‌నగర్: రాష్ట్రంలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ మంత్రివర్గం ఆమోదం తెలపడం సంతోషకరమైన విషయమని రెడ్డి సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు అంతిరెడ్డి విజయ్‌పాల్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని సంఘ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు. సంఘ సభ్యులు అంతిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, ఉప్పులపు రాంరెడ్డి, పవన్‌రెడ్డి, సాయికుమార్‌రెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

బంజార సంఘాల ఆధ్వర్యంలో..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): సంత్ సేవాలాల్ మహారాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ కేబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమని గుడితండా గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు కెతావత్ సురేష్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా గిరిజన తండాలో మిఠాయిలు పంచి సంబురాలు చేసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన క్యాబినెట్ మంత్రి మండలి సమావేశంలో వివిధ కులాల వారికి కార్పొరేషన్లను ప్రకటించడంపై జిల్లా బీసీ హక్కుల పరిరక్షణ సంక్షేమ సంఘం అధ్యక్షులు మాయావార్ రాజేశ్వర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం..

ఖలీల్‌వాడి: యాదవ, కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి మండలికి ధన్యవాదాలు తెలుపుతూ కాంగ్రెస్ నాయకులు బుధవారం నగరంలో సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.నాయకులు కేశ వేణు, వీక్కీ యాదవ్, మల్లేష్, తిరుపతి, శంకర్, సుధాకర్, సతీష్, ధనుష్, చిన్న, హర్షిత్ పాల్గొన్నారు.

సెప్టెంబర్ 17 విమోచన దినం నిర్వహించడం హర్షణీయం



సుభాష్‌నగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించడంపై నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్య్రం సిద్ధిస్తే.. తెలంగాణలో మాత్రం నిజాం నిరంకుశ పాలన కొనసాగిందని గుర్తుచేశారు. 13నెలల తర్వాత 1948 సెప్టెంబర్ 17న సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆధ్వర్యంలో పోలీసులు నిజాం మెడలు వచ్చి తెలంగాణకు, ప్రజలకు విముక్తి కల్పించారని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, కోరికను గుర్తించిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలందరితరపున కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలియజేశారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



మోపాల్: రూరల్ మండలంలోని ఆశోక్‌ఫారం గ్రామంలో శ్రీవైభవ వెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. నేడు స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సంక్షిప్తం

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సిరికొండ: మండలంలోని తూంపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు బుధవారం ప్రారంభించారు. పార్టీ నాయకులు తెడ్ల లక్ష్మణ్, మాజీ సర్పంచ్ దేవరాజు, వినోద్, బాలరాజు, జగదీష్, భైరయ్య, సాయిలు, బొర్రన్న, ప్రవీణ్, రాజు పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో హైమాస్ట్ లైట్లు..

ఇందల్వాయి: మండలంలోని మల్లాపూర్ గ్రామంలో వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను బుధవారం ప్రారంభించారు. లైట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిన ఎంపీ అర్వింద్‌కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యదర్శి అనూష, వీడీసీ సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈవోకు సన్మానం



సుభాష్‌నగర్: నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈవో ఉషను బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జెడ్పీ, మండల పరిషత్ ఉద్యోగులు సన్మానించారు. డిప్యూటీ సీఈఓ సుందర వరదరాజన్, ఉద్యోగులు సునీతాదేవి, లక్ష్మీ, నివేదిత, పద్మ, అన్నపూర్ణ, స్వరూప, సుమలత పాల్గొన్నారు.

ఉద్యోగినులకు క్రీడాపోటీలు



నిజామాబాద్‌నాగారం: నగరంలోని కలెక్టరేట్ మైదానంలో బుధవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మహిళ శిశు సంక్షేమశాఖ అధికారిణి షేక్ రసూల్‌బీ ఆధ్వర్యంలో ఉద్యోగినులకు క్రీడాపోటీలు నిర్వహించారు. కబడ్డీ, టగ్‌ఆఫ్‌వార్, సూదీలోదారం, మ్యూజికల్‌చైర్, రన్నింగ్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలను రసూల్‌బీ అభినందించారు. సీడీపీవో సౌందర్య ఉన్నారు.

కాస్‌బాగ్ తండా జీపీ కార్యదర్శిగా భాగ్య

మోపాల్: మండలంలోని కాస్‌బాగ్ తండా పంచాయతీ కార్యదర్శిగా భాగ్య డిప్యుటేషన్‌పై బుధవారం వచ్చారు. ఈ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న సునీత సెలవుపై వెళ్లడంతో ఆమె స్థానంలో అధికారులు భాగ్యను ఇక్కడికి బదిలీ చేశారు.

కరపత్రాల ఆవిష్కరణ



నిజామాబాద్ సిటీ: నగరంలో బుధవారం పద్మశాలి వధూవరుల పరిచయ వేదిక కార్యక్రమ కరపత్రాలను సంఘ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈనెల 31న రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో పద్మశాలి వధూవరుల పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సంఘ ప్రతినిధులు దాసరి నర్సింలు, మైసల నారాయణ, సత్యపాల్, భీమర్తి రవి, రాజు, అబ్బయ్య పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి

డిచ్‌పల్లి: మధ్యాహ్న భోజన కార్మికులకు గత ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణం విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం డిచ్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మురళి మాట్లాడుతూ.. వేతనాలు రాక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులు సులోచన, సాయిలు, మనోహర్, బాలరాజు, స్వప్న, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

సిరికొండ/ధర్పల్లి/నిజామాబాద్‌నాగారం/డిచ్‌పల్లి: నిజామాబాద్ రూరల్, అర్బన్ నియోజకవర్గాల్లో బుధవారం ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ, బీఆర్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంతోపాటు సిరికొండ, ధర్పల్లి సహా పలు మండల కేంద్రాల్లో పార్టీ నాయకులు కేక్స్ కట్ చేసి, సంబురాలు నిర్వహించారు. ఆయా మండలాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలల్లో పండ్లు, స్వీట్లను పంపిణీ చేశారు. నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



నగరంలో కేక్‌కట్‌చేస్తున్న మేయర్ నీతూకిరణ్, బీఆర్ఎస్ నాయకులు



కవితకు శుభాకాంక్షలు తెలుపుతున్న బాజిరెడ్డి

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	66,300	వెండి (కిలో)	76,100
22 క్యారెట్స్	61,142	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	16	గాజరుగడ్డ	45	60
బెండకాయ	50	70	పచ్చిమిర్చి	40	70
జీరకాయ	40	60	దోసకాయ	25	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	30	60	గోబిగడ్డ	30	50
కాకరకాయ	50	70	గోబిపువ్వు	50	70
వంకాయ	40	60	బీట్‌రూట్	20	40
పాలకూర	20	40	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	35	60	చిక్కుడుకాయ	30	50
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	భీమా (తెలుగు) - 10.50, 1.40, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2	ప్రేమలు (తెలుగు) - 1.30, 7.30 రికార్డ్‌బ్రేక్ (తెలుగు) - 4.30 ఆపరేషన్ వాలెంటైన్(తెలుగు)-10.30
స్క్రీన్-3	గామి (తెలుగు) - 10.30, 1.30, 4.30, 7.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	శైతాన్ (తెలుగు) - 10.20, 1.20, 4.20, 7.20, 10.20
స్క్రీన్-2	గామి (ఇంగ్లీష్) - 10.00, 1.10, 7.35, 10.45 ప్రేమలు (తెలుగు) - 4.20
స్క్రీన్-3	భీమా (తెలుగు) - 12.20, 6.55 డ్యూన్-2 (ఇంగ్లీష్) - 3.25 ఆపరేషన్ వాలెంటైన్(తెలుగు) - 10.00
స్క్రీన్-4	బాబు (తెలుగు) - 1.30 రికార్డ్ బ్రేక్ (తెలుగు) - 4.15 ప్రేమలు (తెలుగు) - 10.15
దేవి	ప్రేమలు (తెలుగు)
నటరాజ్	శైతాన్ (హిందీ)
లలితామహల్	భీమా (తెలుగు)
విజయ్	గామి (తెలుగు)